# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్యానాలో రేపు లాంఛనంగా ప్రారంభించనున్నారు.
- ❖ విశ్వప్రసిద్ధ పూరీ జగన్నాథుని రథయాత్ర ఈ మధ్యాహ్నం ఘనంగా ప్రారంభమైంది.
- ❖ భారత్ ఈ ఏడాది 376 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి సాధించిందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్ ఇంగ్లాండ్ లోని కార్డిఫ్ స్టేడియం వేదికగా జరుగుతోంది.

=====================

ఒడిశాలోని పూరీలో విశ్వప్రసిద్ధ జగన్నాథుడి రథయాత్ర ఈరోజు మధ్యాహ్నం ప్రారంభమైంది. రథయాత్ర ప్రారంభంతో పూరీ పవిత్ర నగరం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవిలు రథాలపై కొలువు తీరగా శంఖారావాలు, వేద మంత్రాలు, `జై జగన్నాథ్` నినాదాలతో మూడు రథాలు లక్షలాది మంది భక్తుల నడుమ శ్రీ గుండిచా ఆలయం వైపుగా ముందుకు సాగుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ రాష్ట్రంతో పాటు దేశం నలుమూలల నుంచి ఈ యాత్రకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

=====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహత్తర ఊరేగింపు సమయంలో మహాప్రభు శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలతో కలిసి భక్తులను కలుసుకోవడానికి బయటకు వస్తారనేది ఒక ప్రసిద్ధ నమ్మకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆ మహాప్రభు జగన్నాథుని ఆశీస్సులు దేశ ప్రజలకు ఆనందం, శాంతి, శ్రేయస్సును తీసుకురావాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. రథయాత్ర విశ్వాసం, భక్తి, సమానత్వం, సామూహిక సామరస్యం వంటి విలువలను ప్రతిబింబిస్తుందని, భారతదేశపు గొప్ప నాగరిక వారసత్వాన్ని చాటిచెబుతుందని

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రథయాత్రను భారతదేశపు శాశ్వత ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా అభివర్ణించారు. ఈ పండుగ వినయం, సామూహిక భాగస్వామ్యం, నిస్వార్థ సేవలకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు హర్యానా, పంజాబ్ చండీఘర్‌లలో పర్యటించనున్నారు. హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో జింద్ - సోనిపత్ మధ్య నడిచే భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలును ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దేశంలోనే రూపకల్పన, ఇంజనీరింగ్, అనుసంధానం చేయబడిన ఈ రైలును స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అభివృద్ధి చేశారు. ఈ రైలును గంటకు 110 కిలోమీటర్ల వేగంతో నడిచేలా రూపొందించినప్పటికీ... ఈ మార్గంలో ఇది గరిష్టంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అలాగే జింద్‌లోని ఏకలవ్య స్టేడియంలో సుమారు 14 వేల 700 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం ప్రధానమంత్రి చండీఘర్‌కు వెళ్లి అక్కడ ఆరోగ్య, విద్యా, రహదారి మౌలిక సదుపాయాల రంగాలలో 6 వేల 600 కోట్ల రూపాయలకుపైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం జలంధర్‌ను కూడా సందర్శించనున్నారు. ఆ ప్రాంతంలో అనుసంధానాన్ని బలోపేతం చేయడం, ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరచడం, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా 5 వేల 470 కోట్ల రూపాయలకు పైగా పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జలంధర్ కంటోన్మెంట్‌తో సహా ఆధునీకరించిన 75 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు.

=====================

దేశ అభివృద్ధి, జాతీయ భద్రత రెండూ ఏకకాలంలో పురోగమించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (BRO) టెక్ సింపోజియంలో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... సరిహద్దులు సురక్షితంగా ఉండటమే కాకుండా, అనుసంధానించబడిన నూతన భారతదేశాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన నాగరికతకు ఆధునిక మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ ఒక ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయన్నారు. నేడు నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలే... రాబోయే సంవత్సరాల్లో దేశ నాగరికతను ప్రతిబింబిస్తాయని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఏ పౌరుడూ నాగరికతకు దూరంగా ఉన్నట్లు భావించకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

భద్రత, ఆర్థిక రంగాల అభివృద్ధికి బిమ్‌స్టెక్ సభ్య దేశాలు తమ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన బిమ్ స్టెక్ జాతీయ భద్రతా అధిపతుల 5వ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ... ప్రపంచ సరఫరా గొలుసులలో అంతరాయాలు అన్ని సభ్య దేశాలకు ఆర్థిక ఇబ్బందులను కలిగించాయని అన్నారు. బిమ్ స్టెక్ సభ్య దేశాలు తక్షణమే సహకరించుకోవాలని, పరస్పర ప్రయోజనం కోసం నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని, చర్చల ద్వారా పరిష్కారాలను కనుగొనాలని ఆయన స్పష్టం చేశారు. బిమ్‌స్టెక్.. హిందూ మహాసముద్రంలోని అత్యంత ముఖ్యమైన ప్రాంతాలను ఒకచోట చేర్చుతుందని, వీటి ఉమ్మడి జీడీపీ దాదాపు ఐదు ట్రిలియన్ డాలర్లుగా ఉందని దోవల్ పేర్కొంటూ..

(వాయిస్ 22 సెకన్లు)

=====================

వాతావరణ మార్పులు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ.. ఈ ఏడాది భారత్ 376 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 377 మిలియన్ టన్నుల ఉద్యానవన పంటల దిగుబడులను సాధించిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పత్రికా సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... శాస్త్రవేత్తలు ఇప్పుడు రైతులతో కలిసి పని చేయడానికి నేరుగా పొలాలకు వెళ్తున్నారని చెప్పారు. `ఖేత్ బచావో అభియాన్` కింద ఎల్ నినో ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న 728 జిల్లాలకు 1,657 శాస్త్రీయ బృందాలు చేరుకుని.. సుమారు కోటి మంది రైతులతో సంప్రదింపులు జరిపాయని ఆయన వెల్లడించారు. మిషన్ ఐసీఏఆర్-100 కింద ప్రభుత్వం `100 యంగ్ సైంటిస్ట్స్ గ్రామ్ ఛాలెంజ్`ను ప్రారంభించనుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం కింద యువ శాస్త్రవేత్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ప్రెసిషన్ అగ్రికల్చర్, క్లైమేట్-స్మార్ట్ అగ్రికల్చర్ వంటి భవిష్యత్-ఆధారిత రంగాలలో ఆవిష్కరణలు చేయడానికి జాతీయ స్థాయిలో పోటీపడతారని చెప్పారు.

=====================

ఉడాన్ పథకం తదుపరి దశలో 120 కొత్త గమ్యస్థానాల అనుసంధానించడం ద్వారా.. రాబోయే 10 ఏళ్లలో 4 కోట్ల మంది ప్రయాణించడానికి వీలుకల్పించడమే లక్ష్యంగా పెట్టుకుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `ఉడాన్ 2.0` కార్యశాల గురించి కేంద్రమంత్రి పాత్రికేయులకు వివరిస్తూ... ఈ నూతన పథకం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం అర్హతను విస్తరిస్తుందని, విమానయాన సంస్థలకు మద్దతును మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలకు పెంచుతుందన్నారు. అలాగే ఎంపిక చేసిన టైర్-2, టైర్-3 విమానాశ్రయాలకు కార్యాచరణ, నిర్వహణకు మద్దతునిస్తుందన్నారు. వచ్చే దశాబ్ద కాలంలో మరో 100 విమానాశ్రయాలు, 200 హెలిపోర్టులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో.. తదుపరి దశ కోసం ప్రభుత్వం 29 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. స్వదేశీ విమాన తయారీకి మద్దతు ఇవ్వడం, నిర్వహణ, మరమ్మతు, ఓవర్ హాల్ (MRO) వ్యవస్థను బలోపేతం చేయడం, ఉపాధి కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక వృద్ధిని పెంచడం ద్వారా ఉడాన్ 2.0 తదుపరి దశ ఆత్మనిర్భర్ భారత్‌ను మరింతగా ప్రోత్సహిస్తుందని రామ్మోహన్ నాయుడు వెల్లడిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

=====================

భారత్-ఇంగ్లాండ్ పురుష జట్ల మధ్య మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో భాగంగా రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్ ఇంగ్లాండ్ లోని కార్డిఫ్ స్టేడియం వేదికగా జరుగుతోంది. ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 37 ఓవర్లు పూర్తయ్యే సరికి 7 వికెట్లు నష్టపోయి 198 పరుగులు చేసింది. భారత బ్యాట్స్ మెన్లలో విరాట్ కోహ్లీ 65 పరుగులు చేసి అవుట్ అవ్వగా.. శ్రేయస్ అయ్యర్ 60 పరుగులతో క్రిజ్ లో కొనసాగుతున్నాడు.

=====================

రాబోయే 7 రోజులలో తూర్పు, ఈశాన్య భారతదేశం, పశ్చిమ హిమాలయ ప్రాంతాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, దీంతో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) పేర్కొంది. రేపు హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న మూడు, నాలుగు రోజులు ఢిల్లీ, హర్యానా, చండీఘర్, పంజాబ్, రాజస్థాన్‌లో కూడా ఇలాంటి పరిస్థితులే కొనసాగుతాయని పేర్కొంది.

=====================
=====================